కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో భరోసా

- ఖరీఫ్ సీజన్‌కు ముందు నుంచే కార్డుల జారీ
- 11 నెలల కాల పరిమితితో అందజేత
- పెడన నియోజకవర్గంలో 6,588 కార్డుల పంపిణీ



కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

పెడన: కౌలు రైతులను ఆదుకునేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల చట్టం 2019 భూ యజమాని హక్కులకు ఎలాంటి నష్టం కలుగకుండా సాగు చేసే కౌలు రైతులకు పంట సాగుదారు కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్న సమయంలో వారికి సాగుదారు కార్డులిచ్చి ఆర్థికంగా చేయూతనిస్తోంది. ఈ కార్డుపై సంతకం చేయడం వలన భూ యజమానులకు, వారి భూమిపై ఉన్న హక్కులకు ఎటువంటి భంగం కలుగకుండా 1956 రక్షిత కౌలుదారీ చట్టాన్ని రద్దు చేసింది. కొత్త చట్టంలో మరికొన్ని జాగ్రత్తలు తీసుకుంది. ఈ చట్టం విషయంలో భూ యజమానులు నిశ్చింతగా ఉండవచ్చునని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం అమలులో భూ యజమానులు, కౌలు రైతులు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని, గ్రామ వలంటీర్లు, వీఆర్వోలు ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగం కలుగకుండా వారి హక్కుల రక్షణకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తూ సాగు చేసే రైతులకు పంట రుణం పొందానికి వీలుగా సాగుదారుల కార్డు మంజూరు చేసేందుకు కొత్త చట్టం తీసుకువచ్చింది. సాగుదారులకు ఇది వరంగా మారింది.

సాగుకార్డు పొందడం ఇలా...

సాగుదారు కార్డు భూ యాజమానికి, సాగు చేస్తున్న రైతుకు మధ్య ఒప్పందాన్ని సూచిస్తోంది. కార్డు పైన భూ యజమాని (లేదా వారి ప్రతినిధి), సాగుదారు, గ్రామ పరిపాలనాధికారి (వీఆర్వో, ఆథరైజ్డ్ ఆఫీసర్) ఈ ముగ్గురి సంతకాలు ఉండాలి. ప్రత్యేకంగా మరే పత్రాన్ని భూ యజమాని రాసి ఇవ్వనవసరం లేదు. పంట సాగుదారు కార్డు కాల పరిమితి 11 నెలలు మాత్రమే. 11 నెలల తరువాత సాగుదారు మళ్లీ కొత్త కార్డు పొందాల్సి ఉంటుంది. గ్రామ వలంటీరు ద్వారా తమకు దగ్గరలోని రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించడం, తద్వారా వీఏఏను కలిసి కార్డుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. సాగుదారు కార్డు పొందిన వారికి ఆ భూమిపై ఎటువంటి హక్కులు ఉండవు. కేవలం పంట రుణాలు, పంట బీమా, సబ్సిడీలు వంటి ప్రభుత్వ మద్దతు పొందడానికి మాత్రమే ఈ కార్డు అవకాశం కల్పిస్తోంది. ఈ కార్డుపై సాగుదారు బ్యాంకు నుంచి పంట రుణం తీసుకుంటే దానిని తిరిగి కట్టే బాధ్యత పూర్తిగా సాగుదారునిపైనే ఉంటుంది. ఏ కారణం వల్లనైనా కట్టలేకపోతే భూ యజమానిపై కానీ లేదా ఆ భూమి పైన కానీ ఎటువంటి భారం భవిష్యత్‌లో ఉండదు.

పెడన నియోజకవర్గంలోని మండలాల వారీగా సాగుకార్డులను పరిశీలిస్తే..

మండలం	గత ఏడాది	ప్రస్తుత ఏడాది
బంటుమిల్లి	1,365	1,218
కృత్తివెన్ను	1,015	920
గూడూరు	2,212	2,071
పెడన	2,497	2,379
మొత్తం	7,089	6,588

మే నెల నుంచే కార్డులు జారీ..

పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 112 గ్రామాల్లో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 7,089 మందికి సాగు కార్డులను జారీ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అంటే మే నుంచి కార్డులను జారీ చేస్తున్నారు. ఇప్పటికే 6,588 కార్డులను జారీ చేశారు. జూలై ప్రారంభం నుంచి జరిగిన జగనన్న సురక్ష శిబిరాల ద్వారా చాలా మంది కౌలు రైతులకు సాగుదారు కార్డులను మంజూరు చేశారు. గత మూడేళ్ల నుంచి సాగుకార్డులు పొందుతున్న వారిని బట్టి అవగాహన లేక భూ యజమానులు సహకారం ఇవ్వకపోవడం వల్ల కౌలు రైతులు సాగు కార్డులు పొందలేకపోతున్నారనే వాదన కూడా ఉంది. ఇటువంటి వారిని చైతన్య పరుస్తుండటంతో ఈ సంఖ్య పెరుగుతూ వస్తోందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

భూ యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం



కౌలు రైతులకు సాగుకార్డుల జారీ విషయంలో భూ యాజమానులలో కొన్ని అపోహలను నివృత్తి చేసి వారి సందేహాలను తీర్చి కౌలు కార్డులు ఇచ్చేలా భూ యజమానులను ప్రోత్సహిస్తున్నాం. ఇందుకోసం ఆర్‌బీకేల పరిధిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. భూమిపై కౌలు రైతులకు ఎటువంటి హక్కులుండవని స్పష్టం చేస్తున్నాం. పంట రుణాలు తీసుకున్నా మీరు ఎటువంటి సంతకాలు చేయనక్కరలేదని, కేవలం కౌలు కార్డుపైన చేస్తే సరిపోతుందనే విషయాన్ని రైతులకు అర్థమయ్యేలా చెబుతున్నాం. మరెక్కడా కూడా సంతకాలు అవసరం లేదని అవగాహన కల్పిస్తుండటంతో ప్రతీ ఏటా వీరి సంఖ్య పెరుగుతోంది. స్థానిక ఆర్‌బీకేలలో సాగుకార్డు కోసం సంప్రదించవచ్చు.

– జీవీ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖాధికారి, పెడన మండలం

పాడి రైతులకు బోనస్ పంపిణీ



కృత్తివెన్ను: కృష్ణా మిల్క్ యూనియన్ పాల సొసైటీ సభ్యులకు బోనస్ పంపిణీ చేస్తోందని గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఏడాదిలో మూడు దఫాలుగా రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల కాలానికి గాను రైతులకు రూపాయికి 10 పైసల వంతున బోనస్‌ను అందిస్తున్నామని చెప్పారు. గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో మొత్తం 104 సంఘాలకు సంబంధించి రూ. 71.24 లక్షలు బోనస్‌గా పంపిణీ చేశామన్నారు. ఆదివారం మండల పరిధిలోని గాంధీనగరం, యండపల్లి, చెరుకుమిల్లి తదితర పాల సొసైటీలలో సభ్యులకు బోనస్‌ను పంపిణీ చేశారు.

చల్లపల్లి: పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక పాల కేంద్రంలో సంఘ అధ్యక్షురాలు బెల్లంకొండ లక్ష్మీ కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో 2023–24 మూడో విడత బోనస్ అందజేశారు. 135 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1,62,148 బోనస్ రూపంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తమ్మన సురేష్ కుమార్, వేతన కార్యదర్శి గొరిపర్తి మురళీ కృష్ణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక ఆగమ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష తులసి పుష్పాలతో అర్చన చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో మాదవీలత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

సబ్సిడీపై నేత సామగ్రి అందజేత



పెడన: పెడన పట్టణంలోని చౌడేశ్వరి రామలింగ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు మగ్గానికి సంబంధించిన సామగ్రిని మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ ఆదివారం అందజేశారు. పట్టణంలోని సొసైటీలో జరిగిన కార్యక్రమంలో 51 మంది చేనేత కార్మికులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై మంజూరు చేసిన రాట్నం, అచ్చులు, ఊసలు తదితర సామగ్రిని అందించామని ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ కృషి మేరకు వీటిని అందించామని చెప్పారు.వైఎస్సార్ సీపీ నాయకులు కోడూరి శ్రీనివాసరావు, నాగకుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీఓ మహాసభలను జయప్రదం చేయండి

చల్లపల్లి: ఏపీఎన్జీఓ రాష్ట్ర మహాసభలను ప్రభుత్వ ఉద్యోగులు విజయవంతం చేయాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ చల్లపల్లి యూనిట్ అధ్యక్షుడు తోట సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సన్నాహాలను పర్యవేక్షించారు. సంఘ నాయకులకు రూట్ మ్యాప్, పార్కింగ్ తదితరాలను తెలిపారు. సుధాకర్ మాట్లాడుతూ మహాసభల తొలి రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి తమ సమస్యలు విన్నవించుకుని పరిష్కారం సాధించుకోవాలని కోరారు. అసోసియేషన్ నాయకులు విజయకుమార్, డి.శివప్రసాద్, నందం బాబూరావు, పెన్షనర్ల సంఘం డివిజన్ కార్యదర్శి అబ్దుల్ అజీజ్, షఫీవుల్లా ఖాన్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



మంగళాపురం(చల్లపల్లి): ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ జి.సాయిసింధు అన్నారు. ఆదివారం మంగళాపురం గ్రామంలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ క్రాప్ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్



కోడూరు: సైబర్ నేరాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రధాన సెంటర్‌లో ఆటోడ్రైవర్లు, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. టెక్నాలజీని వినియోగించుకొని సైబర్ నేరగాళ్లు అనేక మోసాలకు పాల్పడుతున్నారని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే ఎవరూ చెప్పవద్దన్నారు. బ్యాంకు లావాదేవీల వివరాలను గోప్యంగా ఉంచుకోవాలని చెప్పారు. రహదారుల వెంట అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే స్టేషన్‌లో సమాచారమివ్వాలన్నారు. ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలని, మితిమీరిన వేగం, అధిక లోడు ప్రయాణాలు చేయరాదని ఎస్‌ఐ సూచించారు. ఏఎస్‌ఐ వీరాంజనేయులు, హెచ్‌సీ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎల్‌ఈఎఫ్ వార్షికోత్సవం

మచిలీపట్నంటౌన్: నగరంలోని మల్కాపట్నం ఎల్‌ఈఎఫ్ 88వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో క్రైస్తవులు ఆవిర్భావ ఆరాధన నిర్వహించారు. చర్చి పాస్టర్ తంటేపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుని యందు భయం కలిగి జీవించటం వల్ల అనేక విషయాల్లో విజయం సాధించగలుగుతారన్నారు. తద్వారా సమాజంలో శాంతి, సంతోషం, సమాధానం వెల్లివిరుస్తాయని చెప్పారు. ప్రజలు క్రీస్తు మార్గంలో పయనించాలనే సదుద్దేశంతో 1935వ సంవత్సరంలో ఈ సంస్థను చెన్నైలో స్థాపించామని వివరించారు. కార్యక్రమంలో బ్రదర్ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు గీతాలను ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

90 మందికి దంత పరీక్షలు

తోట్లవల్లూరు: దంత సంరక్షణతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని దంత వైద్య నిపుణుడు డాక్టర్ వణుకూరు ప్రవీణ్ తెలిపారు. మండలంలోని రొయ్యూరులో గోసాలకు చెందిన జేడీ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ అనూష, డాక్టర్ హథస్పా 90 మందికి దంత పరీక్షలు చేశారు. 30 మందికి పుచ్చు పళ్లను తొలగించి అవసరమైన మందులను అందజేశారు. శిబిరాన్ని హాస్పిటల్ మేనేజర్ కుందేటి సాంబశివరావు పర్యవేక్షించారు.

సేవలతో ప్రజల అభిమానం పొందాలి



బంటుమిల్లి వార్డు సభ్యురాలు సృజన దంపతులను అభినందిస్తున్న మంత్రి జోగి రమేష్

మంత్రి జోగి రమేష్

పెడన: శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ఆదివారం అభినందించారు. బంటుమిల్లి మండలం బంటుమిల్లి గ్రామంలో వార్డు సభ్యురాలిగా విజయం సాధించిన గొల్ల సృజన దంపతులను, పెడన మండలం కొంగంచర్ల సర్పంచ్ లోయ ఊహ, ఆంజనేయులును మంత్రి అభినందించి సత్కరించారు. మంచి పాలన అందించి ప్రజాభిమానం పొందాలని వారికి సూచించారు. వీరి గెలుపునకు కృషి చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో యువజన నాయకులు జోగి రాజీవ్, ఆయా మండలాలకు చెందిన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కటకం ప్రసాద్‌కు మంత్రి పరామర్శ..

మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి భర్త కటకం ప్రసాద్‌ను మంత్రి జోగి రమేష్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుని కోలుకున్నారు. ప్రసాద్ ఆరోగ్య విషయాలను తెలుసుకుని మంత్రి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు గరికిపాటి రామానాయుడు, కొండవీటి నాగబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా, మల్లి, భైరవలింగం, జేయేష్, మల్లిశెట్టి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మంత్రి జోగి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోసిన కార్యకర్తల కష్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నటికీ మరిచిపోరని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ గూడూరు మండల కార్యకర్తల విస్తృత సమావేశం ఆదివారం గూడూరు సమీపంలోని సుమ కన్వెన్షన్‌లో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్లం మహాలక్ష్మయ్య నాయుడు అధ్యక్షతన జరిగింది. మంత్రి జోగి రమేష్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించారన్నారు. 77 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చెప్పని విధంగా తన పాలనలో మేలు జరిగితేనే వచ్చే ఎన్నికలలో తనకు ఓటు వేయాలని ధైర్యంగా చెప్పిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో కులాలు, మతాలు, పార్టీలు చూసి సంక్షేమ పథకాల మంజూరు చేసేవారన్నారు. అందుకే ప్రజలు 2019 ఎన్నికలలో ఆ పార్టీని 23 స్థానాలకే పరిమితం చేశారన్నారు. సంక్షేమ పథకాల మంజూరులో ఏ ఒక్క నాయకుడి ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలన్నదే జగనన్న లక్ష్యమన్నారు. ఆ విధంగా పాలనలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న పాలనలో కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అందుకే పార్టీలకు అతీతంగా ప్రజలు జగనన్న పాలనను కోరుకుంటున్నారని వివరించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి ఎన్నికల్లో పోటీ చేసినా, విడివిడిగా పోటీ చేసినా వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఆపలేరన్నారు. గత ఎన్నికలలో 151 స్థానాల్లో గెలిచిన వైఎస్సార్ సీపీ ఈ సారి 175 స్థానాల్లో గెలవడమే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి దిగుతోందని చెప్పారు. రానున్న 30 సంవత్సరాల పాటు జగనన్నే సీఎంగా ఉంటే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిస్తే మళ్లీ ఎన్ని కలు వచ్చే వరకు ఏసీ రూముల్లో నుంచి బయటకు రాని పరిస్థితి గతంలో ఉండేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యేలు గడప గడపకు వెళ్లి ప్రజల బాగోగులు తెలుసుకుని ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీస్తున్నారని తెలిపారు.

గడప గడపకు నిధులతో అభివృద్ధి పనులు..

గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన ప్రతి సచివాలయానికి ఇప్పటికే రూ.20 లక్షల చొప్పున మంజూరు చేశామని, ఇప్పుడు గడప గడపకు మన ప్రభుత్వం పూర్తి కాని సచివాలయాలకు కూడా జగనన్న రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నారని వివరించారు. పెడన నియోజకవర్గంపై ప్రత్యేక అభిమానంతో ప్రతి సచివాలయానికి జగనన్న మరో రూ.20 లక్షలు అదనంగా మంజూరు చేస్తున్నారని మంత్రి వెల్లడించారు. తద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూరగడ్డ రమేష్ నాయుడు, జోగి రాజీవ్, సంగా మధుసూదనరావు, వేముల సురేష్ రంగబాబు, తలుపుల వెంకట కృష్ణారావు, కారుమంచి కామేశ్వరరావు, మోటేపల్లి రత్నారావు, గొరిపర్తి రవి కుమార్, గోళ్ల శేషుకుమారి పాల్గొన్నారు.

సాగరతీరంలో మెరైన్ గస్తీ



కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ముమ్మర గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు పెద్ద సంఖ్యలో సాగర తీరానికి తరలివచ్చారు. పర్యాటకులు సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. యువకులు బీచ్‌లో పలు విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. మెరైన్ పోలీసులు పర్యాటకులకు సముద్ర స్థితిగతులపై అవగాహన కల్పించారు. పర్యాటకులు సముద్రంలో లోపలికి వెళ్లకుండా లౌడ్‌స్పీకర్ల ద్వారా అప్రమత్తం చేశారు. మెరైన్ సీఐ పవన్‌కిషోర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్ జానీ, సిబ్బంది గస్తీలో పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



నాగపుట్టలో పాలు పోస్తున్న భక్తులు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కళకళలాడింది. శ్రావణ మాసం, సెలవుదినం ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎటుచూసినా భక్తులతో నిండిపోయింది. క్యూలైన్లు అన్నీ భక్తులతో బారులు తీరాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



చల్లపల్లిలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అవనిగడ్డ: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వంతెన సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు అందె శ్రీరామమూర్తి, దిడ్ల వీరరాఘవులు పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గౌస్, శ్రీమన్నారాయణ, కాగితాల సుదర్శనరావు పాల్గొన్నారు.

- **బోడగుంట(మోపిదేవి):** మండల పరిధి బోడగుంట గ్రామంలో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోసూరు రామాంజనేయులు, పలువురు అభిమానులు పాల్గొన్నారు.
- **చల్లపల్లి:** కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే దేశంలో మత సామరస్యం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనేకుల మురళీమోహన్ అన్నారు. మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతి, జాతీయ సద్భావన దివస్ ఆదివారం స్థానిక పంచాయతీ పార్కు వద్ద ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి మురళీమోహన్, పీసీసీ అధికార ప్రతినిధి వింతా సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు మొవ్వా మోహనరావు, ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు వడ్డీ సోమశేఖర్, డీసీసీ నాయకులు మీర్ రిజ్వాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ దేశానికి రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు ఆది రామ్మోహనరావు, కోసూరు రామాంజనేయులు, మిరియాల లక్ష్మీనారాయణ, జగ్గవరపు బాబూరావు, లయన్స్ క్లబ్ పెద్దలు పాల్గొన్నారు. సద్భావనా దివస్ సందర్భంగా విశ్రాంత ఈఓపీఆర్డీ దాసి సీతారామరాజు ప్రతిజ్ఞ చేయించారు.

ప్రమాదాలకు నిలయంగా విద్యుత్ స్తంభం

తొలగించాలని స్థానికుల వినతి



రోడ్డు మలుపులో ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభం

నాగాయలంక: మర్రిపాలెం డౌన్ నాగాయలంక తూర్పు బజారు మెయిన్ రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మలుపులోని పాత ఇనుప స్తంభం ప్రమాదకరంగా మారింది. విద్యుత్ శాఖ ఉద్యోగులు ఇనుప స్తంభం స్థానంలో పక్కన కొత్త స్తంభం వేసినప్పటికీ రోడ్డు మలుపులో అడ్డంగా ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించలేదు. కొత్త స్తంభం వేసి నెలలు గడిచినప్పటికీ పాతది తొలగించక పోవడంతో వాహన చోదకులు తరచూ మలుపులో ప్రమాదానికి గురవుతున్నారు. ఇటీవల మినీ వ్యాను మలుపులో దూసుకు రావడంతో సమీప గృహాల విద్యుత్ సర్వీసు తీగలు వాహనానికి పట్టి మీటర్లతో సహా తెగిపడ్డాయని స్థానికులు వాపోయారు. పిల్లలు ఈ ఇనుప స్తంభం పట్టుకుని తిరుగుతుండటం, దానిపై కొన్ని విద్యుత్ తీగలు మార్చక పోవడంతో వర్షాలకు విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పాత ఇనుప స్తంభాన్ని తొలగించాలని నెలలు తరబడి విజ్ఞప్తి చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నరు. తక్షణమే రోడ్డు మలుపులోని పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై విద్యుత్ ఏఈ పి.ఏడుకొండలును వివరణ కోరగా అక్కడి ఇబ్బందులు వాస్తవమేనని, ఈ విషయం నా దృష్టికి ఆలస్యంగా వచ్చిందని చెప్పారు. రెండు,మూడు రోజుల్లో స్తంభాన్ని తొలగించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

ఈడేపల్లి గ్రంథాలయంలో 'చదువంటే మాకిష్టం'



మచిలీపట్నంటౌన్: స్థానిక ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమం జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు పుస్తకాలు, దినపత్రికలు, కథల పుస్తకాలు చదివారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ధ్యానం చేయించారు. ప్రతి రోజూ ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ధ్యాన గురువులు బొట్ల రాంబాబు, కిరణ్ గురుబాణి వివరించారు.

బంటుమిల్లిలో వైఎస్సార్ సీపీ మద్దతుదారు విజయం



సృజన

బంటుమిల్లి: బంటుమిల్లి పంచాయతీ 4వ వార్డు సభ్యురాలిగా గొల్ల సృజన ఘన విజయం సాధించింది. శనివారం వార్డు ఉప ఎన్నికకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సృజనకు వైఎస్సార్ సీపీ మద్దతు తెలిపి ప్రచారం నిర్వహించింది. ఇక్కడ మొత్తం ఓట్లు 342 ఉండగా 307 పోలయ్యాయి. సృజనకు 207, టీడీపీ మద్దతుదారు మంజులకు 96 ఓట్లు వచ్చాయి. 4 ఓట్లు చెల్లలేదు. సృజన 111 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించింది. సృజనను వైఎస్సార్ సీపీ నాయకులు, పలువురు గ్రామస్తులు అభినందించారు.